## క్లుప్తంగా

### కాంగ్రెస్‌ ఓబీసీ కో- ఆర్డినేటర్‌గా ప్రదీప్‌గౌడ్‌



అంబర్‌పేట: కాంగ్రెస్‌ పార్టీ ఓబీసీ సెల్‌ రాష్ట్ర కో- ఆర్డినేటర్‌గా అంబర్‌పేట్‌కు చెందిన రంగు ప్రదీప్‌గౌడ్‌ నియమితులయ్యారు. శనివారం ఓబీసీసెల్‌ రాష్ట్ర అధ్యక్షులు నూతి శ్రీకాంత్‌గౌడ్‌ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ స్ఫూర్తితో యువత కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారత్‌ జోడో యాత్ర సందేశాన్ని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేందుకు తామంతా కృషి చేస్తామన్నారు. తనకు బాధ్యతలు వచ్చినందుకు అధిష్టానం అగ్రనాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి



అంబర్‌పేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ అన్నారు. శనివారం మైనార్టీ వర్గం మహిళలు, దివ్యాంగులు ఎమ్మెల్యేను కలిసి ఆసరా పింఛన్లు, ట్రై సైకిళ్లు అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన తెలంగాణలోని అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను సకాలంలో అందించేందుకు నియోజకవర్గంలో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### 31న ఏబీవీపీ జిల్లా మహాసభలు

కాచిగూడ: సీఎం కేసీఆర్‌ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఈ నెల 31న ఏబీవీపీ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ నారాయణగూడ పట్టణ కార్యదర్శి వినయ్‌ పటేల్‌ అన్నారు. శనివారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా మహాసభల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తగిన ఉద్యమ కార్యాచరణను ఈ మహాసభల్లో రూపొందించడం జరుగుతుందన్నారు. ఏబీవీపీ హైదరాబాద్‌ నగర సంయుక్త కార్యదర్శి కొండ సాయిప్రసాద్‌, సాయి ధనరాజ్‌, తేజకిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.

### డైరీ ఆవిష్కరణ



కవాడిగూడ: తెలంగాణ ప్రదేశ్‌ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన డైరీని ఆవిష్కరించారు. శనివారం రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత 67 ఏళ్లుగా క్రమం తప్పకుండా సంఘం ఆధ్వర్యంలో డైరీ ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడప శ్రీహరి, డైరీ కన్వీనర్‌ ఎర్రబోయిన మల్లేష్‌, నాయకులు ఎం.సత్యనారాయణ, గూడబోయిన శివరత్నం , బాలయ్య, ఆర్‌.కె.భగవాన్‌, చంద్రప్రకాష్‌, సుధాకర్‌, మాధవిలత, స్వర్ణలత, సంగీత, సునీతతో పాటు 31 జిల్లాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, గంగపుత్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### అదనపు విద్యుత్‌ చార్జీలను ఉపసంహరించుకోవాలి

ముషీరాబాద్‌: రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్‌ వినియోగదారులపై ఏసీడీ( అడ్వాన్స్‌ కంజంక్షన్‌ డిపార్ట్‌మెంట్‌) పేరుతో వేస్తున్న అదనపు భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్‌) ప్రజాపంథా డిమాండ్‌ చేసింది. శనివారం ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలు మరింత కష్టాల్లోకి కూరుకుపోతూ విద్యుత్‌ వినియోగానికి దూరమవుతారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం విద్యుత్‌ను పూర్తిస్థాయిలో అందిస్తున్నామని చెబుతోందన్నారు. విద్యుత్‌ కోత లేకుండా చేశామని చెబుతూ.. 27 లక్షల వ్యవసాయ కనెక్షన్‌లకు కూడా 24 గంటల కరెంటు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ ప్రస్తుతం వ్యవసాయ మోటార్లకు కోతలు ప్రారంభించిందని విమర్శించారు. అభివృద్ధి చార్జీల పేరుతో విపరీత అదనపు భారాలను మోపిందని విద్యుత్‌ సంస్థ నాలుగేళ్లుగా రూ.33 వేల కోట్ల బాకీతో ఉందని వ్యవసాయానికి ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పే ప్రభుత్వం నేటికి విద్యుత్‌ సంస్థకు ఎలాంటి చెల్లింపులు చేయడం లేదన్నారు. విద్యుత్‌ సంస్థ రూ.33 వేల కోట్ల బాకీలో కూరుకుపోయిందని ఈ బాకీలను కేసీఆర్‌ ప్రభుత్వం సర్దుబాటు చేయాల్సింది పోయి ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు.

# రూ. 68 కోట్లతో నాలా రిటర్నింగ్‌ నిర్మాణ పనులు



రిటర్నింగ్‌ వాల్‌ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్‌

చిక్కడపల్లి: రూ.68 కోట్లతో నిర్మిస్తున్న రిటర్నింగ్‌ వాల్‌ పనులు దాదాపు పూర్తయ్యాయని ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన అరుంధతినగర్‌ బస్తీలో జరుగుతున్న పనులను పరిశీలించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హుస్సేన్‌సాగర్‌ పరివాహక బస్తీ, కాలనీవాసులు వర్షాకాలంలో వరద ముప్పు ఉండేదని ప్రస్తుతం భయపడాల్సిన అవసరం లేదన్నారు. కవాడిగూడ నుంచి గోల్నాక బ్రిడ్జి వరకు మార్చిలోపు పనులు పూర్తవుతాయన్నారు. ఈ సందర్భంగా రిటర్నింగ్‌ వాల్‌ నిర్మాణం సమయంలో పాక్షికంగా యాదమ్మ అనే మహిళ ఇల్లు దెబ్బతిందని ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈశ్వర్‌ నర్సింగ్‌ హోం వద్ద కచ్చమోరీ అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బీఆర్‌ఎస్‌ పార్టీ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహా, జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్‌, డివిజన్‌ అధ్యక్షుడు ఎం.రాకేష్‌కుమార్‌, ముఠా నరేష్‌, ఎర్రం నర్సింగ్‌ముదిరాజ్‌, గిరి, ఎంబీ కృష్ణ, రాజ్‌కుమార్‌, భాస్కర్‌, కిరణ్‌కుమార్‌, సీహెచ్‌ హన్మంతు, పాశం రవి, ప్రేమ్‌, జనార్దన్‌, భాస్కర్‌రెడ్డి, బస్తీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్‌ పాల్గొన్నారు.

### పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

చిక్కడపల్లి: వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని గాంధీనగర్‌ కార్పొరేటర్‌ పావనివినయ్‌కుమార్‌ సూచించారు. జీహెచ్‌ఎంసీ డీఈ సన్నీ, వాటర్‌బోర్డ్‌ డీజీఎం కార్తీక్‌రెడ్డి, సిబ్బంది మల్లేష్‌లతో కలిసి సబర్మతినగర్‌ నూతన బ్రిడ్జితో పాటు రోడ్డు పనులను పర్యవేక్షించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పనులను నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బీజేపీ ఓబీసీ మోర్చా ముషీరాబాద్‌ అసెంబ్లీ కన్వీనర్‌ ఉమేష్‌, లక్ష్మణ్‌యాదవ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, రవీందర్‌, స్థానికులు, బస్తీవాసులున్నారు.



# ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తు



డిగ్రీ పట్టాలతో విద్యార్థినులు

కాచిగూడ: ఉన్నత విద్యతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు సాకారమవుతుందని ఆర్క్‌ డిగ్రీ అండ్‌ పీజీ కళాశాల చైర్మన్‌ ఎ.పరమేశ్వర్‌ అన్నారు. ఆర్క్‌ డిగ్రీ అండ్‌ పీజీ కాలేజ్‌ 'గ్రాడ్యుయేషన్‌ డే' (స్నాతకోత్సవం) వేడుకలు శనివారం నారాయణగూడలోని కళాశాలలో ఘనంగా జరిగాయి. కళాశాల చైర్మన్‌ పరమేశ్వర్‌, వైస్‌ చైర్మన్‌ ఎ.లక్ష్మీలు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు స్నాతకోత్సవ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి విజయాలను ఆనందించడం కంటే అపజయాలను ఎదుర్కోవడం నేర్చుకోవాలని సూచించారు.

- ఓటమి నుంచి విజయతీరాలకు చేరిన వారు ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదని, సమాజానికి చేసిన సేవలే శాశ్వతమని అది భవిష్యత్‌ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు.
- మాతృభూమి, తల్లిదండ్రులను విస్మరించకూడదని పేర్కొన్నారు. సమాజానికి సేవ చేయడం విద్యార్థి దశలోనే అలవాటు చేసుకోవాలన్నారు. డిగ్రీ పట్టాలను పొందిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు.
- డిగ్రీలో వివిధ కోర్సులలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు గోల్డ్‌, సిల్వర్‌ మెడల్స్‌, పతకాలను అందజేశారు. మొత్తం 300 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

## అభినందన



కాచిగూడ: పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు చిన్నతనం నుంచే వారికి మార్షల్‌ ఆర్ట్స్‌ (కరాటే)లో శిక్షణ ఇప్పించాలని జైళ్ల శాఖ హైదరాబాద్‌ రేంజ్‌ డీఐజీ ఎస్‌.మురళిబాబు అన్నారు. పిల్లలకు కరాటేలో శిక్షణ ఇప్పించేందుకు ముందుగా తల్లిదండ్రులు మార్షల్‌ ఆర్ట్స్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అసాంఘిక శక్తుల నుంచి ఆడపిల్లలు, మహిళలు రక్షణ పొందాలంటే కరాటేను నేర్చుకోవాలని సూచించారు. ప్రతిభా విన్యాసాలను ప్రదర్శించిన విద్యార్థులకు అవార్డులు, ప్రశంసాపత్రాలను జీవీఆర్‌ కరాటే ఆకాడమీ విద్యార్థులకు అందజేసి అభినందించారు. కాచిగూడ కార్పొరేటర్‌ కన్నె ఉమారమేష్‌యాదవ్‌, అకాడమీ డైరెక్టర్‌ డాక్టర్‌ జీఎస్‌ గోపాల్‌రెడ్డి, జర్నలిస్ట్స్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ తెలంగాణ అధ్యక్షుడు బాలస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌, అకాడమీ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ అమృతారెడ్డి పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కవితను కలిసిన రాష్ట్ర పదాధికారులు



ఎమ్మెల్సీ కవితతో ప్రతినిధులు

కవాడిగూడ: స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ స్టేట్‌ చీఫ్‌ కమీషనర్‌ కల్వకుంట్ల కవితకు రాష్ట్ర పదాధికారులు నివేదిక అందించారు. శనివారం ఆమె నివాసంలో కలిసి స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల వరలక్ష్మి నివేదిక వివరాలను ఎమ్మెల్సీ కవితకు వివరించారు. ఇటీవల కర్ణాటక మంగళూరులో ప్రపంచ స్థాయి జంబూరి జరిగిందని మన రాష్ట్రం నుంచి జంబూరిలో పాల్గొన్న స్కౌట్స్‌(బాలురు), గైడ్స్‌(బాలికలు) పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారన్నారు. తాజాగా రాజస్థాన్‌లో జరిగిన అఖిల భారత జంబూరిలో కూడా సత్ఫలితాలు వచ్చాయని తెలిపారు. గైడ్స్‌ ఆర్గనైజింగ్‌ కమిషనర్‌ అనంతలక్ష్మి, స్కౌట్స్‌ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ పరమేశ్వర్‌లను ఎమ్మెల్సీ ఈ సందర్భంగా అభినందిచారు.

### ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడు



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ తదితరులు

చిక్కడపల్లి: ఆరోగ్య ప్రదాత ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడని ఆయనను పూజించడం వల్ల మనిషి జీవితంలో వచ్చే కష్టాలన్నీ తొలగిపోతాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ అన్నారు. శనివారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌ ఆంజనేయస్వామి దేవాలయంలో రథసప్తమి సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్‌ మురళీప్రసాద్‌, ఈఓ మాచర్ల దేవనాథం, కమిటీ సభ్యులు డాక్టర్‌ రామకృష్ణ, జీకే రమణ, బాసాని పద్మ, గణేష్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు రాకేష్‌కుమార్‌, రవిశంకర్‌ గుప్తా, ఆకుల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

### పేద బ్రాహ్మణున్ని ఆదుకోవాలి

నల్లకుంట: ఇటీవల హైదరాబాద్‌ నుంచి మంథాల్‌ వెళ్తూ.. రోడ్డు ప్రమాదానికి గురై ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హనుమంతరావును ఆదుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి( టీబీఎస్‌ఎస్‌) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం టీబీఎస్‌ఎస్‌ ప్రతినిధి బృందం ఆస్పత్రికి వెళ్లి బాధితుడి కుటుంబసభ్యులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అపస్మారకస్థితిలో ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆయనను బ్రాహ్మణ సమాజం ఆదుకునేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. టీబీఎస్‌ఎస్‌ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు మంత్రి సునీల్‌, ప్రచార కార్యదర్శి అక్కినేపల్లి పురుషోత్తమరావు, దేవులపల్లి అశోక్‌ కుమార్‌, రామారావు, బడంగ్‌పేట్‌ అధ్యక్షుడు రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరనున్న బీజేపీ నేత



ముషీరాబాద్‌: రాంనగర్‌ డివిజన్‌ బాకారంకు చెందిన బీజేపీ నాయకులు రమేష్‌కుమార్‌యాదవ్‌ బీజేపీకి రాజీనామా చేశారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో బీఆర్‌ఎస్‌ రాంనగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు ఆర్‌.మోజెస్‌తో కలిసి ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిశారు. సీఎం కేసీఆర్‌ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.

## 'దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసే బ్యాంకులు నిర్వీర్యం'



మాట్లాడుతున్న ఏఐబీఈఏ జాతీయ ప్రధాన కార్యదర్శి సీ.హెచ్‌.వెంకటాచలం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసే జాతీయ బ్యాంకులను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి సీ.హెచ్‌.వెంకటాచలం ఆరోపించారు. బ్యాంకుల జాతీయీకరణ దేశంలోని సాధారణ పౌరులు సురక్షితమైన బ్యాంకింగ్‌ వ్యవస్థపై ఆధారపడటానికి సహాయపడిందన్నారు.

- వ్యవసాయం, విద్య, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వంటి రంగాలకు బ్యాంకులు ప్రధానంగా రుణాలు అందించడంలో కూడా ఈ జాతీయీకరణ సహాయపడిందని తెలిపారు.
- ప్రజా సంక్షేమానికి, ప్రజల ఆర్థిక సాధికారతకు సహాయపడుతున్న జాతీయ బ్యాంకులను కేంద్రం ధ్వంసం చేస్తోందని ఆయన మండిపడ్డారు.
- హైదరాబాద్‌ బాగ్‌ లింగంపల్లి, ఆర్టీసీ కళాభవన్‌లో శనివారం యూనియన్‌ బ్యాంక్‌ అవార్డు ఎంప్లాయిస్‌ యూనియన్‌ తెలంగాణ రాష్ట్ర రెండో వార్షిక మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మహాసభలకు వెంకటాచలం ముఖ్య అతిథిగా హాజరై ఏఐబీఈఏ పతాకాన్ని ఆవిష్కరించారు.
- జనవరి 31న యూనియన్లతో సమావేశం నిర్వహించేందుకు ఇండియన్‌ బ్యాంక్స్‌ అసోసియేషన్‌ అంగీకరించిందన్నారు. జనవరి 30, 31 తేదీల్లో రెండు రోజుల దేశవ్యాప్త బ్యాంకు సమ్మెను వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.
- ఐదు రోజుల బ్యాంకింగ్‌, పెన్షన్‌ అప్‌డేట్‌, అవశేష సమస్యలు, నేషనల్‌ పెన్షన్‌ సిస్టమ్‌ను రద్దు చేయడం, వేతన సవరణ కోసం డిమాండ్ల చార్టర్‌పై ఐబీఏతో యునైటెడ్‌ ఫోరమ్‌ ఆఫ్‌ బ్యాంక్‌ యూనియన్స్‌ చర్చలు జరుపుతోందన్నారు. యూనియన్‌ ప్రధాన కార్యదర్శి సమద్‌ఖాన్‌, అధ్యక్షుడు రవీంద్రనాథ్‌, సంఘం చైర్మన్‌ బీఎస్‌ఆర్‌ మోహన్‌రెడ్డి, యూనియన్‌ బ్యాంకు చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ సురేష్‌చంద్ర, ఏఐబీఈఏ జాతీయ కార్యదరి బీ.ఎస్‌,రాంబాబు, అఖిల భారత యూనియన్‌ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌.శంకర్‌, చైర్మన్‌ విన్‌సెంట్‌ డిసౌజా, ఏపీ యూనియన్‌ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్‌, సత్యం, జనని తదితరులున్నారు.

## శాస్త్రీయతతో కూడిన బదిలీలు చేయాలి



ముషీరాబాద్‌: 317 జీవోను బలవంతంగా ఉపాధ్యాయులపై రుద్ది వేల మందిని నాన్‌ లోకల్‌గా చేశారని సౌత్‌ బదిలీలను 19 జిల్లాలో చేసి 13 జిల్లాల్లో ఆపేయడంతో ఆ కుటుంబాలు విచ్ఛిన్నం అయ్యారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్‌ వినయ్‌బాబు ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీ ప్రక్రియను శాస్త్రీయతతో చేయాలని కోరారు. పరిపాలన సౌలభ్యం కోసం రిమోట్‌ ఏరియాలో అలకేషన్‌ పేరుతో ఉపాధ్యాయులను బదిలీచేసి అనేక ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఉపాధ్యాయ సంఘాలు అనేక రకాలుగా విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం జీఓ సర్వీస్‌తో బదిలీ చేయాలని విజ్ఞప్తి చేసిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎన్నికల ముందు ట్రాన్స్‌ఫర్‌, ప్రమోషన్‌ షెడ్యూల్‌ రిలీజ్‌ చేసిందని కుట్ర పూరితంగా వారికి దొడ్డిదారిలో ఇబ్బడి ముబ్బడిగా రంగారెడ్డి, మేడ్చల్‌ పరిధిలోనే వందల బదిలీలు ఇప్పటికే జరిగిపోయాయని తీవ్ర ఆరోపణలు చేశారు. ముందస్తు బదిలీల ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ అక్రమ బదిలీలను రద్దు చేయాలని ప్రైమరీ స్కూల్‌ ప్రధానోపాధ్యాయుల పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. కోర్టు పరిధిలో లేని అన్ని రకాల ఖాళీలను పదోన్నతుల్లో భర్తీ చేయాని 317 జీవోతో బాధిత ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు.



## సృజనాత్మకతను వెలికి తీసేందుకే బాలోత్సవం



ముగింపు సభలో బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు బాలోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమని ఎస్‌వీకే కార్యదర్శి ఎస్‌.వినయ్‌కుమార్‌ అన్నారు. శనివారం సుందయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల పాటు బాలోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు తెలంగాణ బాలోత్సవ కమిటీ బహుమతులను ప్రదానం చేశారు. నగరంలోని అనేక పాఠశాలల విద్యార్థులు ఒకే వేదికపైకి రావడం శుభపరిణామమన్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రముఖ సామాజికవేత్త రమేష్‌, భారత్‌ విద్యాసంస్థల కరస్పాండెంట్‌ సీ.హెచ్‌.వేణుగోపాల్‌రెడ్డి, తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతివెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను వెంటనే ఏర్పాటు చేయాలని జాతీయ ఎంబీసీ సంఘాల సమితి కన్వీనర్‌ కొండూరు సత్యనారాయణ డిమాండ్‌ చేశారు. 2023–24 బడ్జెట్‌లో బీసీ, ఎంబీసీల సంక్షేమానికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని కోరుతూ ప్రధాని, ఆర్థిక మంత్రికి లేఖలను రాసి మెయిల్‌ ద్వారా పంపించినట్లు తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాని మోదీకి పంపిన లేఖలను విడుదల చేశారు. దేశ జనాభాలో 52 శాతానికి పైగా ఉన్న బీసీ, ఎంబీసీలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీలకు ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీ, ఎంబీసీల సంక్షేమానికి బ్యాంకులతో సంబంధం లేకుండా రుణాలు మంజూరు చేయాలని కోరారు. అఖిల భారత సగర మహాసభ అధ్యక్షుడు విజేంద్రసాగర్‌, పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌, మేలు సంఘం అధ్యక్షుడు మాధవ్‌, నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ, ఎంబీసీ కో-కన్వీనర్‌ కోట్ల శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

## నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి



కాచిగూడ: విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని తెలంగాణ హైకోర్టు విజిలెన్స్‌ రిజిస్ట్రార్‌ కె.సాయిరమాదేవి సూచించారు. శనివారం రాంకోఠిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నవ చైతన్య జూనియర్‌ కళాశాల వార్షికోత్సవం – 2023 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే ఉత్తమ ఉద్యోగాలు పొంది ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారన్నారు. హనుమంతరావు, కృష్ణ, ప్రిన్సిపాల్‌ శ్రీదేవి, రవికుమార్‌, శంకర్‌ తదితరులున్నారు.

## బద్రుకలో ముగిసిన 'స్లాపష్‌-2కె23'



కాచిగూడ: బద్రుక పీజీ కళాశాలలో 'స్లాపష్‌ –2కె23' పేరుతో నిర్వహించిన మేనేజ్‌మెంట్‌ అండ్‌ కల్చరల్‌ మీట్‌ వేడుకలు ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన ఫ్యాషన్‌షో, డాన్స్‌, స్లాపష్‌ రేస్‌, క్విజ్‌ అఫైర్స్‌, ఈవెంట్‌ మార్కెంటింగ్‌, ఫైనాన్స్‌ ఈవెంట్‌, యంగ్‌ మేనేజర్‌, తదితర పోటీల్లో నగరంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. గోల్కొండ ఇబ్రహీంబాగ్‌కు చెందిన పెండేకంటి ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌ కళాశాల అత్యధిక పోటీల్లో గెలుపొంది 'క్రౌన్‌ ఆఫ్‌ కాలేజెస్‌ ట్రోఫీ'ని అందుకున్నారు. పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్‌ శ్రీరాములు మాట్లాడుతూ.. విద్యతో ఏదైనా సాధించవచ్చని విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మానవతా విలువలను తెలుసుకుని ముందుకు సాగాలని సూచించారు. బద్రుకా కళాశాల డైరెక్టర్‌ జనరల్‌ ప్రొఫెసర్‌ అభిరామకృష్ణ, పీజీ సెంటర్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ రాజశేఖర్‌రెడ్డి, స్లాపష్‌ కన్వీనర్‌ డాక్టర్‌ రాజేశ్వరి, అసోసియేట్‌ ప్రొఫెసర్లు డాక్టర్‌ అనుపమ, వినుత కందుకూరి తదితరులున్నారు.

### సర్వ మానవాళికి భగవద్గీత

నల్లకుంట: భగవద్గీత సర్వ మానవాళి కోసమని గాంధీ జ్ఞాన మందిరం డైరెక్టర్‌ ప్రవీణ్‌ కపాడియా అన్నారు. ఆధ్యాత్మిక విశ్వ విద్యాలయం (ఏవీవీ) ఆధ్వర్యంలో శనివారం గాంధీ జ్ఞాన మందిరంలోని యోగ కేంద్రంలో 'ఆధ్యాత్మిక సదస్సు' నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. భగవద్గీతలోని 700 శ్లోకాల్లో ప్రతి శ్లోకంలో మనిషి ఉన్నతంగా జీవించడానికి కష్టసుఖాలు ఎదురైనప్పుడు నడుచుకోవాల్సిన విధానం గురించి గొప్పగా చెప్పబడిందన్నారు.

- సుప్రీం కోర్టు న్యాయవాది, ఆధ్యాత్మిక విశ్వ విద్యాలయం పీబీకే అమోల్‌ భాయ్‌ మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత పరమాత్ముడి ద్వారా లభిస్తుందన్నారు. మన జీవన విధానంలో భగవద్గీత చదవడం అందరికి కుదరదని అలాంటి వారి కోసం ప్రతి శ్లోకం, తాత్పర్యాన్ని సులభంగా అందరికీ అర్థమయ్యేలా ఆధ్యాత్మిక విశ్వ విద్యాలయం పుస్తకాన్ని అందిస్తోందన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో భగవద్గీతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఏవీవీ పీబీకే శైలజ, శాంత, రంజన, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.



### డబుల్‌ ఓట్ల తొలగింపు ప్రక్రియ షురూ !

ముషీరాబాద్‌: ఒకే వ్యక్తికి చెందిన ఓటు వివిధ పోలింగ్‌ బూత్‌లు, పక్క డివిజన్‌, వేరొక నియోజకవర్గంలో ఉంటే వాటిని తొలగించే కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–15 అధికారులు శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించిన సమావేశాన్ని శనివారం సాయంత్రం కార్యాలయంలో డీఎంసీ హరికృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ తరపున అసెంబ్లీ కన్వీనర్‌ రమేష్‌రావు, కాంగ్రెస్‌ తరపున భోలక్‌పూర్‌ డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ వాజీద్‌ హుస్సేన్‌, బీఆర్‌ఎస్‌ తరపున సీనియర్‌ నాయకులు కొండపల్లి మాధవ్‌, శ్యామ్‌సుందర్‌, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, బీఎస్‌పీ తరపున నరేందర్‌తో పాటు ఎంఐఎం, సీపీఎం, సీపీఐ ప్రతినిధులు హాజరయ్యారు.

- ముషీరాబాద్‌ నియోజకవర్గంలోని 274 పోలింగ్‌ బూత్‌లలో 19,347 మంది రెండు ఫోటోలతో కూడిన ఓట్లు ఉన్నాయని ఈ సమావేశంలో డీఎంసీ వివరించారు. ఈ డబుల్‌ ఫోటోలు ఉన్న ఓటర్లను సోమవారం నుంచి బూత్‌ లెవల్‌ ఆఫీసర్స్‌ (బీఎల్‌ఓ)లు గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.
- ఓటరుకు రెండు చోట్ల ఓటు ఉంటే తనకు ఇష్టమైన చోట ఉంచుకునేందుకు వివరణ తీసుకుని మిగతా చోట్ల తొలగిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

### మ్యాన్‌హోళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



జలమండలి అధికారులకు సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్‌ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: మ్యాన్‌హోళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బాగ్‌ అంబర్‌పేట కార్పొరేటర్‌ పద్మావెంకట్‌రెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. నూతన సీసీ రోడ్ల నిర్మాణ సమయంలో డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం సరిగ్గా చేయకపోవడంతో తరచూ సమస్య తలెత్తుతోందని అధికారులకు కార్పొరేటర్‌ తెలిపారు. శనివారం డివిజన్‌లో పలు ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న మ్యాన్‌హోళ్ల సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జలమండలి అధికారులతో పాటు స్థానిక బీజేపీ నాయకులున్నారు.